# నా జవాబే తప్పు!

## వేమగిరి సత్యనారాయణ

నేను బస్సు దిగేసరికి నాలుగవుతోంది.

గోపాలరావు నాకోసం తప్పకుండా బస్సు దగ్గరకు రావాలి. ప్రతిసారీ వచ్చేవాడలా. కాని బస్సు దిగిన అయిదారు నిమిషాలకయినా వాడి జాడలేదు. ముందు ఈ ప్రయాణపు అలసట తీర్చుకొందామని కాఫీ హోటల్లో కడుగుపెట్టాను. ఆకలిగా ఉన్నా ఆ హోటల్ వాతావరణం చూసి కాఫీకి మాత్రమే ఆర్డరు చేశాను.

గోపాలరావూ, నేనూ డిగ్రీకి కలిశాం. పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కలిసే పూర్తిచేశాం. ఇంటిదగ్గరున్న మిల్లూ, పొలమూ వాటి వ్యవహారాలు చూసుకొంటూ ప్రశాంతంగా ఉంటానని చెప్పి గోపాలరావు ఉద్యోగం మాటే తలపెట్టలేదు. వాళ్ల నాన్నగారు రాజకీయాల్లో పడి తిరుగుతూంటారు. నేను ఉద్యోగం చేస్తున్న చోటు ఆ ఊరికి దగ్గరే కావడాన అప్పుడప్పుడూ రెండు రోజులు వరుసగా సెలవు దొరికినప్పుడల్లా ఆ వూరికి వస్తుంటాను. ప్రశాంతమైన ఆ పల్లె వాతావరణమూ, పరమానందకరమైన గోపాలరావు సాహచర్యమూ అక్కడ నాకు చాలా చక్కటి రిలీఫ్‌ను అందిస్తాయి.

కాఫీ త్రాగి బయటపడ్డాను. ఇంకా వీడు రాలేదు. నెమ్మదిగా ఊళ్ళోకి సాగుదామా అనుకొంటుండగా అతను నా దగ్గరకొచ్చాడు.

అతనికి దాదాపు నలభై ఏళ్ళ వయసుంటుంది. అతని బట్టలకు మూడు నాలుగేళ్ళయినా వయసుంటుంది. చిరుగు లెక్కన, మంచి భాగాలకంటే! అంత బీదవాడా అన్పించింది.

"డోన్ట్‌మైన్డ్ సర్ సిగిరెట్టోటిస్తె రేమిటీ?" అన్నాడతను నా దగ్గరకు రాగానే.

ఈ సిగిరెట్లడుక్కొనే వాళ్ళంటే నా కెక్కడిలేని సానుభూతి సాటి స్మోకర్‌గా. వెధవ నాగరికత ముసుగు కప్పుకొట్టి నేను ఒక్కోసారి ఎంత క్రిందు మీద అవుతానో నాకనుభవమే. ఒకసారి హైదరాబాదు వెళ్తుండగా సిగిరెట్లున్నాయో లేవో చూసుకోకుండా బస్సెక్కాను. తీరా చూస్తే రెండే సిగిరెట్లున్నాయి. అంతాచేసి అవి పదిమైళ్ళకే ఖర్చయిపోయాయి. మరో ముప్పైమైళ్ళకుగాని బస్‌స్టాప్ రాదు. ఇకచూడండి నా పరిస్థితి. కాలుగాలిన పిల్లినయ్యాను. పిచ్చెక్కినవాడిలా ఊపిరి బిగబట్టుక్కూర్చున్నాను అక్కడి వరకూ.

సిగిరెట్ తీసిచ్చి సూట్‌కేస్ చేతిలోకి తీసుకొన్నాను బయల్దేరదామని.

"స్టాప్, లిసన్, ప్రొసీడ్" అన్నాడతను నన్నాపుతూ. ఆశ్చర్యం, చిరాకూ కలిపి వెలిశాయి నాలో.

"థ్యాంక్స్. యూ టేక్ దిస్" అంటూ ఓ ఒక్కపొడి పలుకు నాచేతిలో పెట్టాడతను. తర్వాత నన్ను పట్టించుకోకుండానే నేనిచ్చిన సిగిరెట్ రెండు ముక్కలుచేసి ఒక సగం జేబులో వేసుకొని, మిగిలినది నోట్లో పెట్టుకొని వెలిగించుకొన్నాడు ప్రక్కనున్న కిల్లీకొట్టు దీపం దగ్గర. 'వీడేం పిచ్చోడు కాదుగదా', అనిపించింది నాకు. అలా అనిపించిందని పిస్తూండగానే వీపు చుర్రుమనిపించినట్లూ అనిపించింది. చూస్తే గోపాలరావు. అప్పటికే ఓ చరుపు చరిచి గ్రీట్ చేసేశాడు నన్ను "సారీ బ్రదర్. కొంచెం లేటయింది" అంటూ.

"లేటయినందుకు కోపంలేదుగాని గోపాలం. ఈ దెబ్బ చూశావ్." నవ్వేశాను.

వాడు నామాట పట్టించుకోలేదు "పోదాం పద. స్నానం అదీచేసి మళ్ళీ వస్తే ఇటు వద్దాం" అని అక్కడున్న కూలీని పిలిచి నా సూట్‌కేస్ ఇచ్చాడు వాడికి.

టైం చూశాను. నాలుగున్నర.

"అప్పుడే ఏం వెళ్తాం లేరా. సూట్‌కేస్ పంపించు. అలా మీ చేను గట్టుకెళ్ళి కాసేపు కూర్చొని వెళదాం ఏమంటావ్?" అన్నాను.

"రేయ్ ఆ సూట్‌కేస్ ఇంట్లో ఇచ్చి, పట్నం బాబుగారొచ్చారని చెప్పు. నే వెళ్ళేటప్పుడు కన్పించు డబ్బులిస్తా" నా ప్రశ్నకు వాడు కూలీ కిచ్చిన సమాధానం ఇది.



ఇద్దరం చేలవైపు బయలుదేరాం.

సరిగా ఆ చిన్న సెంటర్లోని చివరి షాపు దాటి వెళుతూండగా కన్పించిన దృశ్యం నన్ను చకితుడిని చేసింది. ఇంతకుముందు పది నిమిషాల క్రితం నా దగ్గర సిగిరెట్ తీసుకొన్న వ్యక్తి, తన జేబులోంచి నేనిచ్చిన సిగిరెట్‌లోని సగభాగాన్ని తీసి, మరో వ్యక్తి-అతనికి అరవైకి పైనే వయసుంటుంది- నోట్లో పెట్టి

అగ్గిపుల్లతో వెలిగిస్తున్నాడు.

ఆ రెండో వ్యక్తి పిచి వాలకంతోనే కన్పడ్డాడు.

ముందుకు నడుస్తున్నా- వారినే తిరిగి తిరిగి చూస్తూ నడుస్తున్నాను.

నన్ను గమనించిన గోపాలరావు "ఏరోయ్. ఎవర్నో బంగారు తీగలాంటి పడుచునొదిలేసి వస్తున్నట్లు ఏమిటా వెనక చూపులు" అన్నాడు పరాచికంగా.



నా అనుమానం వ్యక్తపరుస్తూ "వాళ్ళిద్ద రెవర్రా...ఒకతను నా దగ్గరకొచ్చి సిగిరెట్..." చెబుతుండగానే "స్టాప్" అన్నాడు గోపాల రావు.

"తర్వాత కథ నేను చెబుతాను. నువ్వు సిగిరెట్టిచ్చావు. అతను 'టాంక్స్' అనో 'టాంక్స్‌కాదు థ్యాంక్స్' అనో అన్నాడు. అంతేకాదు. నీ చేతిలో ఓ వక్కపలుకో.... ఒకపైసా నాణెమో పెట్టాడు 'యూ టేక్ దిస్ సర్' అని. నువ్విచ్చిన సిగిరెట్ సగం తుంచి...."

"ఇప్పుడు నువ్వాగాలి!" నేనన్నాను. "నువ్వు చెప్పేదంతా రైట్, తు.చ. తప్ప కుండాను. అయితే చిత్రమైన ఆ పిచ్చి వాళ్ళెవరో కూడా నీకు తెలుసా? వాళ్ళ వివ రాలు....ఎందుకలా అయ్యారు.. వాళ్ళ అసలు కథేమిటి అదీ తెలుసా?"

"తెలుసు బ్రదర్. నీకంత ఉత్సాహంగా ఉంటే చెప్తాను కూడా."

"తప్పకుండా వినాలి నేను."

"రైట్. గ్రాంటెడ్. అయితే నడుస్తూ ఎందుకీ కథాకార్యక్రమం. అక్కడో చెట్టు క్రింద సెటిలవుతాంగా ఎలాగా. అప్పుడు చెబుతాను."

కథ వినాలన్న ఆత్రమేమో అంగులు కొంచెం వడిగానే వేయసాగాను. పంటకరాల పైచిలుకు ఒకే ప్లాటుగా ఉన్న గోపాలరావు వాళ్ళ చేనిగట్టు చేరాం. గుబురుగా పెరిగివున్న ఓ మామిడిచెట్టు నీడన చతికిలబడ్డాక సిగ రెట్ అంటించుకొనేవరకూ కూడా ఆగలేక పోయాను. "చెప్పరా!" అన్నాను హార్చో గానే.

అప్పటికే గోపాలరావు సిగరెట్ అంటించేశాడు. పీల్చి వదిలిన పొగను ఉంగరంగా ఊదేస్తూ అన్నాడు "నేనా కథ చెప్పేముందు నువ్వో ప్రశ్నకు సమాధానం చెప్పాలి. మనిషికి పిచ్చిపట్టడం అదృష్టమా దుర దృష్టమా?"

క్షణం కూడా ఆలోచించలేదు నేను. "పిచ్చెక్కినవాడిలా మాట్లాడకు. పిచ్చి అదృష్టమెలా అవుతుంది? అది నూటికి పాళ్ళూ దురదృష్టమే!" అన్నాను.

'పల్లెటూళ్ళో సాయంత్రం' అనుభవిస్తు న్నాను. మేం కూర్చున్న ప్రదేశానికి చుట్టూ పచ్చగా పెరిగిన పంటచేలు. పంటచేలపై నుంచి తెరలుతెరలుగా దూసుకువస్తున్న చల్లని గాలి, ఆహ్లాదకరంగా ఉన్నదా వాతావరణం.

గోపాలరావు చెప్పసాగాడు.

* * *

ఆ ఇద్దరిలో పెద్దవాడి పేరు పరంధా మయ్య. ఇప్పటికి ఇరవై సంవత్సరాల క్రితం కేవలం వ్యవసాయమే తెలిసిన ఓ మోతుబరి రైతు. ఉన్న నలభై ఎకరాలూ సమ్మకమైన బంటుల్లా సేవచేస్తూంటే కడుపులో నీళ్ళు కదలకుండా, ఉన్న ఊరు దాటకుండా సుఖ జీవనం చేస్తున్నవాడు.

ఆ సుఖజీవికి కష్టాలకు ముందు గొప్ప సంతోషం ఎదురైంది.

పరంధామయ్యగారున్న గ్రామంలో ధాన్యపుమిల్లు లేదు. ఆ వూరి ధాన్యమంతా పక్కవూరి మిల్లుకే పంపవలసివస్తుండేది.

ఇద్దరు మధ్యతరగతి రైతులు పరంధా మయ్యగారి ముందుకో పథకాన్ని తీసు కొచ్చారు.

"చూడండి. మన వూరి ధాన్యమంతా పొరుగూరికి తోలడం, మిల్లులో లాభాలన్నీ పొరుగూరికే పోవడం, చాలా అన్యాయం. మన వూరికో మిల్లు ఉండటం అవసరం. మిల్లును స్థాపించాలంటే మీకొక్కరికే స్తోమత ఉంది. మేమిద్దరం చెరో పావలా వాటా ఉంటాం. మీరు సగభాగం వుండండి."

ఇదీ వారి పథకం.

పరంధామయ్యగారి నోట్లో నానుతున్న చుట్ట చివరను కొరికి ఉమ్మేస్తూ "మనకెందు కురా ఈ మిల్లులూ, బొల్లులూ. బంగారంగా భూదేవి పండుతోంది. ఆ దేవి చల్లగా చూస్తుంటే అదే చాలు మనకు. పిచ్చిపిచ్చి ఆలోచనలు పెట్టుకోక బుద్ధిగా పొలంపనులు చూసుకోండి" అనేశాడు.

కాని వాళ్ళిద్దరూ ఊరుకోలేదు. ఓ రెండు గంటలపాటు సతాయించారాయన్ను. రెండు గంటలూ గడిచాక కొద్దిగా ఆలోచనలో పడ్డా డాయన. 'రేపు చెప్తాలేరా' అని చెప్పిపంపిం చేశాడు వాళ్ళను. ఆ రేపు లోపు లెక్క వేసు కొన్నాడు పరంధామయ్యగారు. పెట్టుబడి క్రింద తన మొత్తం పొలంలోని ఒక సంవ త్సరం పంట పూర్తిగా పెట్టాలి. 'నష్ట పోతే?' అన్న ఆలోచన వచ్చినా 'ఒక సంవ త్సరం పంట పోయిందనుకొని చూదాం' అన్న నిర్ణయాని కొచ్చేశాను.

ఫ్యాక్టరీ ప్రారంభమయింది.

పెద్ద వాటాదారుడు పరంధామయ్యగారే అయినా తొలి సంవత్సరం కాలక్షేపంగా ఫ్యాక్టరీవైపు వెళ్ళడం మినహా మేనేజిమెంట్ వ్యవహారాలేమీ పట్టించుకోలేదాయన.

కాని ఆ సంవత్సరం చివర్లో లాభనష్టాల లెక్కలు చూసుకొన్నప్పుడు పరంధామయ్య గారిలో గొప్ప సంచలనం చెలరేగింది.

వచ్చిన లాభం....పెట్టిన పెట్టుబడీ....ఆ డబ్బు విలువేగల పొలంపై వచ్చే ఆదాయమూ తిరిగ్గా బేరీజువేసుకొంటే గొప్ప లాభసాటి బేరంగా కనపడిందిది.

పరంధామయ్యగారిలో 'బిజినెస్‌మాన్' చోటు చేసుకొన్నాడు.

రెండో సంవత్సరం చివరకు ఫ్యాక్టరీ మొత్తం తనే స్వాధీనం చేసుకొన్నాడు, మిగతా వాటాదార్ల డబ్బు ఇచ్చేసి.

మూడో సంవత్సరం చివరకు ఫ్యాక్టరీకి ఒక మేనేజర్ని వేసి, తాను అప్పటికే పెరిగిన పరిచయాల్ని ఆధారం చేసుకొని కంట్రాక్టులు చేసే వ్యాపారమూ మొదలుపెట్టాడు.

నాలుగో సంవత్సరం పూర్తయేసరికి ఆంధ్రదేశంలోనే గుర్తింపబడ్డ వ్యాపారస్థు డయిపోయాడాయన.

నలభై ఎకరాల పొలమూ నూటనలభై ఎకరాలయింది.

ఇద్దరు కూతుళ్ళకూ చెరో ఇరవై అయిదు ఎకరాలూ ఇచ్చి, ఆ పైన చెరొకొక లక్ష డబ్బిచ్చి పెళ్ళిచేశాడు. ఉన్న ఇద్దరుకొడుకులూ పై చదువుల కెళ్ళారు.

పైలా పచ్చీసుగా, గడుస్తున్న ఆ కాలంలో ఆయన పైసలు రూపాయలుగా మార్చేసు కొంటున్నాడు.

మినిష్టర్ల పరిచయాలూ, రికమండేషన్లూ, ఇంజనీర్లతో సంబంధాలు—పరంధామయ్యను అయిదేళ్ళక్రితం చూసి మళ్ళీ ఇప్పుడే చూసిన వాళ్ళు, వాళ్ళను వాళ్ళే నమ్మలేక పిచ్చిపట్టి పోయేంతగా మార్పొచ్చిందాయనలో.

కాని....

* * *

చెప్తున్నవాడల్లా చేతిలోవున్న సిగిరెట్ సగంలోనే ఆర్పేసి సర్దుక్కూర్చున్నాడు గోపాలరావు. వాడి చూపులో కంగారు చూసి నేను రోడ్డువైపుకి చూశాను. ఆగిన జీపులోంచి దిగి మా వైపే వస్తున్నారు గోపాలరావు

నాన్నగారు. లేచి నిలబడి "నమస్కారమండీ" అన్నాను.

"ఏమోయ్. ఎప్పుడు రావడం. కులాసా" అంటూ నన్ను పలకరించేసి "ఏరా అప్పిగాడు రాలా" అన్నారు కొడుకునుద్దేశించి.

"రాలేదే...." అన్నాడు గోపాలరావు

"వెధవలు ఒక్కపనీ పూర్తిచేయరు ఛ" అంటూ విసుక్కొని వెనుదిరుగుతూ సరే వస్తానోయ్ ఉంటావుగా" అంటూనే జీపువైపు వెళ్ళసాగారాయన. జీపు చాటున బీడీ తాగుతున్న డ్రైవరు బీడీ ఆర్పేసి డ్రైవింగ్ సీటు ప్రక్కకొచ్చి నిలబడ్డాడు.

వెళుతున్న జీపులోని గోపాలరావు నాన్నగార్ని చూస్తే నాకు ఎందుకో పరంధామయ్యగారు మనసులోకొచ్చారు.

"కానీయ్‌రా. కాని అవి....ఆగిపోయవ్" అన్నాను గోపాలరావును హెచ్చరిస్తూ.

"వస్తున్నా...." అంటూ గోపాలరావు సిగిరెట్ ముట్టించాడు.

* * *

కాని....ఏదో సంవత్సరం మొదట్లో చిన్న ముడితో ప్రారంభమైన పరంధామయ్యగారి ఆర్థికస్థితి ముడిమీద ముడి పడి చిక్కుముడిగా మారి, ముళ్ళపొదలా తయారైంది.

ధరల హెచ్చుతగ్గుల విన్యాసాలలోపడి ఫ్యాక్టరీలో నష్టాలు, చేసిన కంట్రాక్టుల్లో 'మేనేజిమెంట్' నిర్వహిస్తున్న ఉద్యోగస్థుల తెలివి తేటలవల్ల వాటిలో నష్టాలు....ఆశతో ప్రారంభించిన ఎక్స్‌పోర్ట్ వ్యాపారం మొదట్లోనే బెడిసికొట్టి అందులో విపరీతమైన నష్టం. అంతా కల్లోలమైపోయింది.

పరంధామయ్యగారు కొంచెం దెబ్బ తిన్నారన్నమాట తప్పితే ఆయన దిగిపోయిన గోతికి లోతెంతో లోకులకు తెలియదు. ఆయన పరపతి 'అంతగా' దెబ్బతినలేదు.

అయితే ఆ వార్త పొగచూరిపోయిన కట్టెల నిప్పులా రాజుకుంటూనే వుంది.

పరంధామయ్యగారి గుండె చెదరలేదు. పరిస్థితుల ఎదురుతాకిడికి ఆయన బెదరలేదు. అప్పటికే ఆయన 'చాకచక్యం' ఉన్న వ్యాపారస్థుడయాడు గనుక.

తనస్థితి మేడిపండులాటిదే అయినా ఆ మేడిపండు పగలకముందే తనకున్న పరపతిని సవ్యంగా ఉపయోగించుకొని తిరిగి పుంజుకొనేందుకు పగడ్బందీగా పథకాలు వేయసాగారు. మేడిపండుపగలనీయకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకొందామని ప్రయత్నించసాగారు.

కాని ఇక్కడో చిత్రం జరిగింది. అల్లుళ్ళకిచ్చిన పొలం అటు కూతుళ్ళ పేరగాని, అల్లుళ్ళ పేరగానిరాయలేదుఅంతవరకూ.అల్లుళ్ల


## మా నూతన ప్రచురణలు

వాసిరెడ్డి సీతాదేవి రచనలు
మట్టి మనిషి 1-00
రాబందులూ-రామచిలుకలూ -00
అడవిమల్లె -50
మృగతృష్ణ -00
తిరస్కృతి -00
తొణికిన స్వప్నం -00
మారిపోయిన మనిషి -00
మిసెస్ కైలాసం -00
సమత -00
మంచివాడు -00

డి. కామేశ్వరి రచనలు
ఇది జీవితం -00
అరుణ -00
విధి వంచితులు -50
కొత్త నీరు -50
తల్లి మనసు -00
కన్నీటికి విలువెంత -00
తిరిగి దొరికిన జీవితం -00

పడగ నీడ 6-00
శిక్ష 4-50
అతకని బతుకులు 6-00
వివాహబంధాలు 6-00

రాచకొండ విశ్వనాథశాస్త్రి రచనలు
రాజు-మహిషి 10-00
బుక్కులు 5-00
గోవులు వస్తున్నాయి 5-00
అల్పజీవి 6-00
కలకంఠి 4-00
ఆరు చిత్రాలు 4-00
ఆరు సారా కథలు 3-00
తిరస్కృతి 3-00
విషాదం 3-00
రత్తాలు రాంబాబు 1వ భాగం 7-50

ఆశాలత రచనలు
అరని పారాణి 6-00
స్పందన 6-00
ఈ సంఘం చెక్కిన శిల్పాలు 6-00

నవీన్ రచనలు
సౌజన్య 6-00
ముళ్ళపొదలు 9-00
స్త్రీ—చలం 6-00
సంఘర్షణ—తురగా జానకీరాణి 6-00
వాసనలేని పూలు—శ్యామల జయరామిరెడ్డి 4-50
జీవనసంధ్య—చౌదరాణి 3-75
నీలాంటి ఒకరు—ఆదివిష్ణు 5-00
ఇల్లాలి ముచ్చట్లు 1వ భాగం —పురాణం సీత 5-00
విడిన మబ్బులు—తమిరిశ జానకి 6-00
రాము—కావిలిపాటి విజయలక్ష్మి 6-00
నెరజాణలు-మగధీరులు —మాదిరెడ్డి సులోచన 6-00
మహిళా సమాజం —సి. ఆనందారామం 6-00

ప్రతులకు:
ఫోన్ 61181
అరుణా పబ్లిషింగ్ హౌస్
ఏలూరు రోడ్డు, విజయవాడ-2

అలా పొలం స్వాధీనం చేయమని బలవంత పెట్టకపోవడానికీ కారణముంది. తమ పొలంతో పాటే పండించి, ఖర్చులేవీ తీసుకోకుండా పండిన పంట మొత్తం అల్లుళ్ళకి ఇచ్చేస్తూ వచ్చాడాయన. తమ పేరరాస్తే ఎక్కడ ఈ ఖర్చులు తమ నెత్తినపడతాయోనన్న దూరాలోచన చేశారు అల్లుళ్ళు.

మామగారు దెబ్బతిన్నారన్న వార్తకేమీ చలించలేదు, వాళ్ళు. ఆయనకు తగిలిన దెబ్బ ఎంతటిదిలే అనుకున్నారు, ఆయనకున్న ఆస్థి తలచుకొని. కాని పరంధామయ్యగారు ఆ ఇబ్బందుల కారణంగా సంవత్సరం పంట వెంటనే పంపలేకపోవడంతో అల్లుళ్ళకుఆయన 'దెబ్బతింటున్న' వేడి తాలూకు సెగతగిలింది.

వాళ్ళు ఆ మంటను తీసికెళ్ళి కొడుకుల మనసులకూ అంటించారు.

ఇంకేముంది అల్లుళ్ళూ, కొడుకులూ నిల దీశారు పరంధామయ్యగార్ని.

పరంధామయ్యగారు సర్వశక్తులూ కేంద్రీకరించారు. వారికి నచ్చచెప్ప చూశారు.

"ఈ పరిస్థితి ఇప్పట్లో మారకపోదు. నేను మీకు పొలం రాసిస్తున్నాననిగాని, మరో జాగ్రత్తేదైనా తీసుకొంటున్నానని గాని తెలిస్తే నన్ను అప్పులవాళ్ళు చుట్టేస్తారు. అప్పుడు ఎవరమూ ఏమీ చేయలేము. నా ప్రాణాలు ధారపోసి అయినా నేనీ పరిస్థితులు చక్కదిద్దిస్తాను. మీరు కొంచెం నెమ్మదించండి."

పరంధామయ్యగారి క్షోభ కన్పించలేదు అప్పుడు-ఆయన అల్లుళ్ళకుగాని కొడుకులకు గాని. ఆస్థి పంచివ్వమని, కనీసం పిత్రార్జితం తాలూకు నలభై ఎకరాలలో వాటా అయినా ఇచ్చి తీరాల్సిందేనని కొడుకులూ, కట్నాలు అప్పుడే ఇవ్వక తప్పదని అల్లుళ్ళూ హెచ్చరించి వెళ్ళారు. వెళ్తూ వెళ్తూ 'కట్నాలొచ్చే వరకూ మీ కూతుళ్ళూ ఇక్కడే' అని చెప్పి వారిని వదిలి మరీ వెళ్లారు అల్లుళ్ళు.

ఇంట్లో జరిగిన గొడవలు బజారుకీ తెలిశాయి. బజారు రకరకాలుగా వ్యాఖ్యానించింది. బజార్లో పరంధామయ్యకు బాకీపెట్టిన వ్యక్తులు వ్యాఖ్యానాంతో ఆపక మా బాకీలు తీర్చమన్న వత్తిడీ తెచ్చారు.

కళ్ళముందు....తన కళ్ళముందే పెరిగిన సంపద, పరపతి, పేరు, ప్రతిష్ట ఒకవైపు కూలిపోతుంటే, 'ఇంత చేసింది తమకోసం కాదా' అన్న ఆలోచనేలేక కొడుకులూ, అల్లుళ్ళు తనపై భరించలేని వత్తిడి తెస్తుంటే అంత గొప్ప వ్యాపారదక్షతా, గుండె ధైర్యమూ సంపాదించుకొన్న పరంధామయ్యగారి హృదయం వ్రయ్యలయింది. మనసు ముక్కలయింది.

ఆలోచనల వేడికి ఆలోచనే నశించింది. మనసు చెదిరింది. గుండె పగిలింది. పిచ్చి మిగిలింది. తెల్లారేసరికి పరంధామయ్య పిచ్చి వాడయ్యాడు. పిచ్చివాడయిన పరంధామయ్యను వదిలి వూరుకొనేంత రాక్షసులు కాదనుకో కొడుకులూ, కూతుళ్ళూ....కాని.... వారిని తనవాళ్లు అనుకోలేక పోయాడాయన అంత పిచ్చిలోనూ....ఎంత చెప్పినా పిచ్చిగా కాదనేసి బయటే అలా అలా తన బ్రతుకు సాగిస్తున్నాడు.

* * *


# M/s. Vinod Solvextracts Private Limited,

Administrative office

**35. Chinnathambi Street,**

**MADRAS - 600 001.**

*Factory :*

TADEPALLE, NEAR OLD DALDA FACTORY,
P. O. Kistna Cement Works (522 502)
GUNTUR Dist (A.P.)

*Leading Exporters of :*

**Rice Bran Extraction, Groundnut Extraction, Niger Seed Extraction, Niger Seeds, Sesame Extraction, Undecorticated Cotton Expeller Cake and all other varities of extractions.**

L. V. RAMAIAH
*Chairman.*

"గోపాల్రావియ్యా" సన్నటి స్వరం విన పడటంతో అటు చూశాను.

అక్కడ, నల్లగానైనా అందంగా, నును పైన శరీరం కాకపోయినా నాజూకైన శరీర సౌష్టవంతో, ఆ అమ్మాయి నిలబడివుంది. వయసు ఇరవై ప్రాంతాల్లో ఉంటుంది.

"ఏం భాగ్యం ఏంకావాలి" అన్నాడు గోపాలరావు ఆ అమ్మాయివంక చూస్తూ.

"రేపు కలుపు తీయించాలనారుగా.... ఎంతమందిం రావాలి."

"నేను కబురు చేస్తాలే వెళ్ళు" అన్నాడు వీడు.

"వానాగు ఎండు మట్టలు లాక్కుపోతా నియ్యా. పొయ్యిలోకి బొత్తిగా ఏం లేవు."

"అలాగేలే. ఆ తూర్పువేపు తాళ్ళవి లాక్కో" అని వాడు అంటుండగానే వాడి వంక చూసి ఓ మనోహరమైన నవ్వు నవ్వి చకచకా వెళ్ళిపోయింది ఆ అమ్మాయి.... భాగ్యం. అంతేకాదు ఆ అమ్మాయి నవ్వుకు జవాబుగా గోపాలరావు కళ్ళలోకూడా నవ్వు కదిలినట్లనిపించింది నాకు.

"ఏరోయ్. పేరు సార్థకం చేసుకొంటున్నావా" అన్నాను కన్నుగీటి.

మా ఇద్దరిమధ్యా చనువు చాలా అధికం. వాడు నవ్వి అన్నాడు "లేదులే. కాని ప్రవ రాఖ్యుడినీ కాదు. ఏదో...." కొంచెం ఆగి వాడే అన్నాడు "అసలిక్కడ పనిపాటలు చేసుకు బ్రతికే జనం. ఇప్పటి ఈ పరిస్థితిలో తప్పనిసరిగా పతనమవుతున్నారు మనం అనుకునే నీతిపరంగా. అంతే కాదు ఈ జనంలోంచే మరో ప్రపంచం చూపిన ఒక వ్యక్తి కథ. అదే ఆ రెండో పిచ్చివాడి కథ నీకు చెప్పాలి కూడా ఇప్పుడు."

నా ఆలోచన భాగ్యంపై నుండి, నా దగ్గర సిగిరెట్ తీసుకొన్న వ్యక్తి పైకి మళ్ళింది. సిగిరెట్ అంటిస్తూ"చెప్పు త్వరగా"అన్నాను.

* * *

పరంధామయ్యగారి పెద్దపాలేరు గురవయ్య. అతని కొడుకు రాముడు. రాముడు ఒక్కడే కొడుకవడంతో గురవయ్య వాడిని మరీ చిన్నతనం నుంచీ పనిపాటలకు పంపక చదివించాడు ముద్దుగా. రాముడు తెలివిగలవాడు. వాడు ఎలిమెంటరీ సెకన్ దాటిపోయే సరికి గురవయ్యలో ఆశ కలిగింది. హైస్కూలులో ఫీజు ఎలాగూ కట్టక్కర్లేదు. వాడిని చదివించితే మంచిదనుకొని వాడి చదువు కొనసాగించాడు.

చురుకైన రాముడు చురుగ్గానే చదివాడు. స్కూల్ ఫైనల్‌లో మంచి మార్కులతో నెగ్గాడు.

అయితే అప్పటికే ఒక్క చేతిమీద నడిచే సంసారం గావటాన, పరంధామయ్యకు నాలు గొందలు పైచిలుకు బాకీపడి వున్నాడు గురవయ్య.

ఆశ పీకుతున్నా, పైకి చదివించలేక 'ఇక వీడినేం చెయ్యాలా' అన్న అనుమానంలో ఉండగా పుల్లారావు ఒక మంచి ఆఫర్‌తో వచ్చాడు.

పుల్లారావుదీ ఆ ఊరే. ఇరవై ఏళ్ళక్రితం పట్నంపోయి ఎలాగో గవర్నమెంటాఫీసు ఒక దాంట్లో బంట్రోతుగా చేరి అక్కడే స్థిరపడిపోయాడు.

అతని కూతురు లక్ష్మి చక్కని చుక్క.


ఆధునికమైన బంగారు నగలకు,
అత్యంత కళావిలసితమైన వెండి వస్తువులకు

ఫోన్ : 446962

## ఎస్. గురువయ్యశెట్టి అండ్ సన్స్

( స్థాపితము : 1930 )

92, పాండీబజార్, టి. నగర్

మద్రాసు - 600 017

మా 'కల్పతరువు సేవింగ్స్ స్కీము'లో చేరి లాభపడండి!

చదువు పెద్దగా వంటపట్టకపోయినా, వంటా వార్పూ చేయడం నేర్చుకొని అదృష్టమైన పెళ్ళికూతురిలా పెళ్ళికి సిద్ధమైంది.

పుల్లారావ్ ఆఫర్ ఏమిటంటే— లక్ష్మిని రాముడికిచ్చి పెళ్ళి చేస్తాడు. అక్కడే ఏ ఆఫీసర్ కాళ్ళో పట్టుకొని గుమస్తా ఉద్యోగం వేయిస్తాడు. తనూ వాళ్ళకి అండగా ఉంటాడు.

గురవయ్యకు అద్భుతమనిపించింది ఈ అవకాశం. తన కొడుకు తనకు దూరంగా ఉన్నా తనకన్నా మంచి జీవితం గడపగలడన్న ఆనందంతో ఈ ఏర్పాటుకు సరేనన్నాడు.

రాముడు, లక్ష్మి దంపతులయ్యారు. రాముడు గవర్నమెంట్‌లో గుమాస్తా కూడా అయ్యాడు.

వారి సంసారం చక్కగా, సంతోషంగా సాగుతోంది.

రాముడికీ కొత్త జీవితం పరమానంద భరితంగా ఉంది. ఇక్కడ పాలేరుగా బ్రతికితే....ఎవరికి పాలేరైనా ఇతరులకు కూడా 'అవసరమయినప్పుడు' పనులు చేసి పెట్టవలసిన పరిస్థితి. ఉదాహరణకు చెప్తా విను. నేను బస్‌స్టాండుకు రావాలనుకో. సమయానికి మా పాలేరు లేడు. అక్కడ రోడ్‌పైన ఎవరి పాలేరు కన్పించినా 'ఒరేయ్ ఈ సూట్‌కేస్ కొంచెం తెచ్చిపెట్టు' అంటే వాడు తెస్తాడంతే. నేను నీ పాలేర్ని కాదు పొమ్మనడు. అలా జరిగిపోతుందిక్కడ. అంతే.

మరి అక్కడో! ఆఫీసులో తన పై ఆఫీసరు తప్పించి బయటికొస్తే రాజు. పొదుపుగా గడుపుకొంటున్నారేమో ఇంట్లో కూడా ఇబ్బందులు లేకుండానే గడుపుతున్నారు.

లక్ష్మి కూడా రాముడికి చక్కని సాహచర్యాన్నిచ్చింది.

రాముడు తామిద్దరికీ 'గొప్ప భవిష్యత్తు'ను సృష్టించుకోవడంకోసం తన ప్రయత్నాలు మొదలుపెట్టాడు.

నైట్ కాలేజీలో చేరి పి.యూ.సీ. పూర్తి చేశాడు. భార్య ప్రోత్సాహంతో డిగ్రీలో కూడా చేరాడు.

అతను, డిగ్రీ మొదటి సంవత్సరంలో ఉండగా పుల్లారావు చనిపోయాడు.

అదే అతని దురదృష్టదశకు ప్రారంభం అని అప్పటికి అతనికి తెలియదు.

మామగారు పోయిన దుఃఖం అతనికీ, తండ్రి పోయిన వేదన ఆమెకీ కలిగాయి తప్ప తమ జీవితం అనుకోని మలుపు తిరగబోతోందని వాళ్ళిద్దరికీ తెలియదు అప్పుడు.

అతను బి.ఏ. రెండో సంవత్సరంలో ఉండగా ఆర్థికమైన కల్లోలంలోబడి ప్రభుత్వం చాలామంది ఉద్యోగస్థులను తీసివేయవలసి వచ్చింది. రాముడి ఉద్యోగం పోయింది. మిగిలింది 'ఎప్పుడో అవకాశమున్నప్పుడు ప్రభుత్వం ముందుగా వీరికే ఉద్యోగాలిస్తుందన్న' ఆశ.

ఇతరత్రా ప్రయత్నాలు మొదలుపెట్టాడు. లంచాలూ, సిఫార్సులూ ఇంత విచ్చలవిడిగా ఉంటాయని అప్పుడే తెలిసిందతనికి.

రోజులు గడిచేకొలదీ ఇంట్లోగడవని స్థితి తయారయింది.

మగవాడిగా కుటుంబం పోషించలేని తన అశక్తతకు సిగ్గుపడ్డాడు. నెమ్మదిగా తనకున్న ఈ బాధతో భార్య ఎదట గడపటమే కష్టమై


*With best compliments from:*

**BELDE ELECTRO ENTERPRISES PRIVATE LIMITED,**

**141, Rashtrapathi Road,**
**Secunderabad - 500 003.**

★

*Distributors for:*

**Rallifans, Wolf Tools,**
**Home Appliances, Philips**
**Fittings & Fortuna Moped.**

Phone No: 76516 or 70241.

పోసాగిందతనికి. ఎప్పుడో అర్ధరాత్రికి ఇల్లు చేరేవాడు. అక్కడికీ ఉన్నంతలో ఏదో చేసి పెడుతోంది లక్ష్మి.

వీరి ఇంటి పక్కనే ఉంటున్న పైపై లా పచ్చీసుగా జీవితం గడిపే ఓ యువకుడు రాజారావు లక్ష్మిపై ఎప్పటినుంచో ఆశలు పెంచుకొని ఉన్నాడు. ఒకసారి చనువాయగా బయటపడి భంగపడ్డాడు. అది కేవలం వారిద్దరు ఉండగానే జరగటంలో ఎవరికీ తెలియదు.

ఇప్పుడు చిక్కిన అవకాశాన్ని పూర్తిగా ఉపయోగించుకొన్నాడతను. ఒక వైపు 'సీతి' కొరడాలంపెట్టి కొడుతున్నా, కడుపులో విన్యాసం చేస్తున్న ఆకలి కత్తులగాయాలు మరింతగా బాధపెట్టసాగాయామెను. అంత వివేకవతీ, పలక్షణంగా కాపురం చేసుకొంటున్నదీ ఒకవాడు పతనమయింది. రాజారావుకు లొంగిపోయింది.

అయితే అప్పటికీ భర్తపై తన ప్రభావం లేదామెకు. తాను అలా సంపాదించింది. తమ ఇద్దరికోసమేనన్న భావమే తప్ప మరోటి లేదామెలో.

రోజులు గడుస్తున్నాయి. రాముడి ఉద్యోగ ప్రయత్నాలు ఫలించడంలేదు. పైగా అతనికీ భార్య విషయంగా అనుమానం కలిగింది. బయటపడలేకపోయాడు. బయటపడే సాహసం చెయ్యలేక పోయాడు. కళ్ళు మూసుకొన్నాడు కావాలని. ఉద్యోగం దొరకగానే మరో చోటికి పోయి అంతా మరిచిపోయి కొత్త జీవితం ప్రారంభించుదామనుకొన్నాడు.

కాని ఉద్యోగం దొరికే లోపలే అతనికా ప్రయత్నంనుంచి విముక్తి లభించింది.

రోజులు ముందుకు సాగినకొద్దీ, రాజారావుతో సంబంధం కేవలం డబ్బు సంబంధంగాక ఈ దినదిన గండంగా గడిపే రోజుల నుండి విముక్తి కలిగించే ఆశాదీపంలాఅన్పించసాగింది లక్ష్మికి. అందుకు దోహదంచేశాయి. వారిద్దరూ కలుసుకొన్న ప్రతిసారీ రాజారావు తనకు వాగ్దానం చేసే గొప్ప జీవితంపై ఆశలు.

చివరికి ఆ ఆశే గెలిచింది, కూడు కూడా పెట్టలేని భర్తతో కాపురంకంటే తనను విలాసాల్లో ముంచెత్తే రాజారావుతో జీవితమే మంచితన్న నిర్ణయానికొచ్చిందామె. ఆ నిర్ణయానికొచ్చాక మనిషి తట్టుకోవడం కష్టం. ఆమె కూడా తట్టుకోలేకపోయింది.

ఆ మర్నాడే తెలిసింది రాముడికి తన భార్య రాజారావుతో లేచిపోయిన సంగతి.

రాముడికోపం వచ్చింది. ఏడుపొచ్చింది. విరక్తి కలిగింది....అతనిలో అగ్నిపర్వతాలు పేలాయి, మంచు కొండలు పగిలాయి.... మనసు చచ్చిపోయిందనిపించింది.

తనూ భార్యచేసిన పనే చేశాడు. అతనూ లేచిపోయాడా పట్టణం నుంచి .... తోడుగా 'పిచ్చి'ని వెంటపెట్టుకొని. తిరిగి తిరిగి పిచ్చివాడిగా ఈ సెంటరుకు చేరాడు. ఇక్కడే ఉంటున్న పరంధామయ్యగారూ, రాముడూ గొప్ప దోస్తులయిపోయారు. అలా కాలం గడుపుతున్నారు....ఒకరికోసం ఒకరుగా....ఏ విచారాలూ మనసుకు సోకని స్థితిలో...."

చీకటితో పోరాటంలో ఆ రోజుకు అలసిపోయి తెల్లజెండా ఎత్తేస్తోంది వెలుగు. పూర్తిగా కన్పించకుండాపోయినా సూర్యుడి ప్రభావం—వెలుతురు—పరంగా—కొంచెం మిగిలివుంది అప్పుడు. కథ చెప్తూ వెలిగించి చేతిలోపట్టుకొన్న సిగరెట్ చేతిలోనేచివరంటా కాలడం గమనించని గోపాలరావు కథ పూర్తి చేశాక చూసి సిగిరెట్‌ను అవతల పారేశాడు. పారేసి నామీదకో ప్రశ్ననూ విసిరేశాడు.

"ఇప్పుడు చెప్పరా బ్రదర్....నువ్వు




# లక్ష్మి జనరల్ స్టోర్స్

&

M/s. శిష్ట్లా లక్ష్మీపతిశాస్త్రి (షరం)

ప్రఖ్యాతి చెందిన రిటైల్ బట్టల షాపులు

బీసెంటు రోడ్, గవర్నరుపేట *· విజయవాడ - 2.

35 సం॥ల నుండి ప్రజాసేవ చేయుటలో ప్రాముఖ్యముగల సంస్థలు.
ఆధునిక వేషధారణకు అనువైన ఫ్యాషన్ చీరెల సప్లయిదారులు.
సుందరమై, విశ్రాంతికి అనువైన మా షోరూములలో అత్యంత నాణ్యమైన

* నైలెక్సు ప్రింటింగ్ చీరెలు సరిక్రొత్త డిజైనులలో
* కళాత్మకమైన డిజైనులు గల చేనేత చీరెలు
* డీలక్సు అండ్ స్పెషల్ క్వాలిటీ పట్టుచీరెలు

(గ్యారంటీ వెండి జరీతో తయారుచేయబడినవి)

100% టెరిలిన్ సూటింగులు, షర్టింగులు — న్యాయము, సరసమైన ధరలకు
ఆహ్లాదకరమైన మా ఆదరణతో బాటు లభించగలవు.

నువ్వున్న పరిస్థితిని మరిచిపోయి. వాళ్ళిద్దరి స్థానాల్లో నిన్ను ఊహించుకొని చెప్పు. వాళ్ళకు పిచ్చెక్కిపోయేముందు వారి మనసు ఎదుర్కొన్న క్షోభను భరిస్తూ, రంపపు కోత లాంటి ఆ మానసిక వేదనను మోస్తూ—నిమిష నిమిషం బాధతో విలవిలలాడుతూ ఆ టార్చర్ భరిస్తూ, 'మంచివాళ్ళ'గా వుండటం అదృష్టమా?—లేక ఇప్పుడు చూశావుగా వాళ్ళను- ఈ స్థితిలో బ్రతకడం అదృష్టమా?"

మొత్తం కథ శ్రద్ధగా విన్న నేను ఇప్పుడూ తడుముకోలేదు. వెంటనే చెప్పాను.

"మొదట చెప్పిన నా జవాబు తప్పేరా బ్రదర్. నా జవాబే తప్పు. వారి స్థితిలో నన్ను ఊహించుకొన్న భావమే నాలో వణుకు తెప్పిస్తోంది. మైగాడ్ ..ఎంత భయంకరమైనదా వేదన."

అంతకు ముందురోజే నేను చూసిన 'మానవత్వం' అన్న నాటకంలో ఒక పాత్ర చెప్పిన మాటలు గుర్తొచ్చాయి నాకు-మనుషులెలాగూ సమానత్వం సాధించుకోలేక పోతున్నారన్న జాలితో మరణం వారిమధ్య సమానత్వం సాధించిపెడుతోంది.చావు గొప్ప సోషలిస్టు—అన్నమాటలవి. నా కనిపిస్తోందీ. కథ విన్నాక 'పిచ్చికూడా ఒకరకంగా సోషలిజమేనని. మోతుబరి పరంధామయ్యా,ఆయన పాలేరు కొడుకు రాముడూ ఎంత సఖ్యంగా సహజీవనం సాగిస్తున్నారూ! ఒకరికొకరు ఏ తేడాలూ లేకుండా ఎలా తోడుగా వుంటున్నారూ అని—

"లేద్దామా బ్రదర్" అన్నాడు గోపాలరావు.

లేచి ఊరివైపు నడక సాగించాం. ఇక్కడికి వస్తున్నప్పటి వాతావరణంలో ఎంత తేడా. వచ్చినప్పుడు అత్యంతాహ్లాదకరంగా. పచ్చని పొలాలపై చల్లని గాలులు వీస్తుంటే స్వర్గంలా అన్పించింది, ఇప్పుడు చీకటి కమ్ముకుని చుట్టూ రంగుల భేదమేమీలేక నల్లగా, రాక్షసంగా ఒకటే రంగుగా కన్పిస్తూ.... అంతకు ముందు చల్లగా ఉన్న గాలికి మరింత చల్లదనం చేరి చల్లిగా మారి....వణుకు కల్గిస్తోంది....వేగంగా నడుస్తూ అనుకొన్నాను.. 'వాళ్ళిద్దరి జీవితాల మొదలులాగా ఉన్న వాతావరణం, (పిచ్చి పట్టకముందు) వారి జీవితాల చివరి భాగంలాగా మారిపోయిందే' అని.***


# Hallmark of Quality Block Making

★ a line or a photo

a two colour or a three colour

nothing is too big nor too small for

KAMAL's experienced craftsmen

**For QUALITY BLOCKS & PROMPT DELIVERY**

Contact Phone : 446260

**KAMAL PROCESS**

BLOCK MAKERS,

54, Usman Road, T. Nagar,

MADRAS-17.